క్లుప్తంగా

శాస్త్రోక్తంగా చండీ హోమం



చండీ హోమం నిర్వహిస్తున్న పురోహితులు

ఏయూ క్యాంపస్: స్థానిక పోలమాంబ ఆలయంలో గురువారం ఉదయం చండీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతి నెలా మంగళవారం, శుక్రవారం, పౌర్ణమి, అమావాస్య రోజుల్లో భక్తుల సమక్షంలో చండీ హోమం నిర్వహించడం ఆనవాయితీ. భక్తులు స్వయంగా పాల్గొని తమ స్వహస్తాలతో హోమం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.గాయత్రి పర్యవేక్షించగా, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు. హోమంలో పాల్గొనదలిచే భక్తులు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని అధికారులు సూచించారు.

నేడు ఏయూ మైదానంలో ముగ్గుల పోటీలు

ఏయూ క్యాంపస్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్టు కార్యక్రమ కన్వీనర్ చెరువు రామకోటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అధ్యక్షతన, టీం 4 జీవీఎల్ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు సంక్రాతి వేడుకలు జరగనున్నాయి. ఇందులో భాగంగా జరిగే ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతిగా ముగ్గుల మహారాణి బిరుదుతో పాటుగా రూ.25,116 నగదు, ద్వితీయ బహుమతిగా ముగ్గుల రాణి బిరుదుతో పాటుగా రూ.10,116, తృతీయ బహుమతిగా ముగ్గుల యువరాణి బిరుదుతో పాటు రూ.5,116 నగదు బహుమతి అందిస్తామన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు ఉదయం 9 గంటలకు ప్రాంగణానికి చేరుకుని తమ పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

నౌకానగర్‌లో అగ్నిప్రమాదం



వ్యర్థ పదార్థాలకు నిప్పు పెట్టడంతో వ్యాపించిన మంటలు

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డు నౌకానగర్‌లో గురువారం రాత్రి వ్యర్థాలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో ఆ మంటలు వ్యాపించి దగ్గరలోని బడ్డీలకు పాకే ప్రమాదం ఉండడంతో స్థానికులు స్పందించి అదుపులోకి తీసుకువచ్చారు. ఈ క్రమంలో ఇనుముతో తయారు చేసిన బడ్డికి మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో ఎటువంటి ఆస్తి నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఖాళీ స్థలాల్లో కూరగాయలు పండిద్దాం



కూరగాయల నారు మొక్కలతో మురళీనగర్ వాసులు

మురళీనగర్: ఇంటి వద్ద ఖాళీ స్థలాలతోపాటు మిద్దెపై కూరగాయలు పండిద్దామని మిద్దె పంటల సాగుదారులు పిలుపునిచ్చారు. గ్రీన్ క్లైమేట్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఎన్‌జీజీవోస్ కాలనీలో మిద్దె పంటల సాగుదారులు సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా కూరగాయల మొక్కలు, విత్తనాలు పంపిణీ చేశారు. హరిత విశాఖను సాధిద్దామని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జీవీ రత్నం, 50 మంది మహిళలు, ఔత్సాహికులు పాల్గొన్నారు.



జగనన్న విద్యా దీవెన.. ఉన్నత విద్యకు మార్గం

- జీవీఎంసీ జోన్–3 పరిధిలో 4,320 మందికి లబ్ధి
- 5వ విడత పంపిణీకి సిద్ధం
- ప్రభుత్వ సహకారంపై విద్యార్థుల ఆనందోత్సాహం





అర్హత జాబితాను పరిశీలిస్తున్న విద్యార్థినులు (ఫైల్) (ఇన్‌సెట్) విద్యార్థులకు పంపిణీ చేసిన కార్డు

ఎంవీపీ కాలనీ: ఉన్నత చదువులు.. ఉన్నత లక్ష్యాల దిశగా విద్యార్థులను నడిపించాలనే కాంక్షతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యాదీవెన యువతకు బాసటగా నిలుస్తోంది. విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక ఇబ్బందులు అడ్డురాకూడదనే ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. దానికి కొనసాగింపుగా ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం మరిన్ని మెరుగులు దిద్ది జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పేరిట అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా ఎందరో విద్యార్థుల ఉన్నత విద్య కల సాకారమవుతోంది.

ఇదీ పథకం లక్ష్యం..

ఆర్థిక సమస్యల కారణంగా విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలను ప్రవేశపెట్టింది. ఈ పథకాల ద్వారా ఇంటర్మీడియెట్ మినహా, ఐటీఐ, పాలిటెక్నికల్, డిగ్రీ, ఆపైస్థాయి కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు కళాశాలలు, విద్యార్థి ఉంటున్న హాస్టల్ యాజమాన్యాల ఖాతాలో ప్రభుత్వం జమ చేసేది. అయితే వైఎస్ జగన్ సర్కారు ఆ నిబంధనలు సవరించి నిధులను నేరుగా విద్యార్థి, తల్లిదండ్రుల ఖాతాలకు మళ్లించింది. దీంతో విద్యార్థుల ఉన్నత చదువు సాకారానికి ఈ నిధులు పక్కాగా వినియోగంలోకి వచ్చాయి. మూడు కేటగిరీలుగా ఈ నిధులు అందిస్తున్నారు. ఐటీఐ విద్యార్థులకు ఏడాదికి రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఆపైస్థాయి విద్యార్థులకు రూ.20 వేలు చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. ఏటా రెండు దఫాలుగా నిధులు మంజూరు చేస్తోంది.

జోన్–3 పరిధిలో అర్హులు 4,320

జోన్–3 పరిధిలో జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాల కింద 4,320 మంది విద్యార్థులు లబ్ధిపొందుతున్నారు. వీరికి ప్రతి విడత విద్యా దీవెనగా రూ.6.48 కోట్లు నిధులు అందజేస్తున్నారు. ఇప్పటికే పలు దఫాలుగా ఆయా నిధులు అందుకున్నారు. త్వరలోనే 5వ విడత నిధులు అందుకోనున్నారు. జోన్–3 పరిధిలో అత్యధికంగా 24వ వార్డులో ఈ పథకానికి 502 మంది అర్హులైన విద్యార్థులు ఉండగా.. 23వ వార్డులో 463 మంది విద్యార్థులు, 25 వార్డులో 448 మంది విద్యార్థులు ఆ తరువాతి స్థానంలో ఉన్నారు. 14వ వార్డులో అత్యల్పంగా 162 మంది విద్యార్థులు అర్హత కలిగి ఉన్నారు.

జోన్–3 పరిధిలో వార్డుల వారీగా అర్హులైన విద్యార్థులు..

వార్డు	విద్యార్థుల సంఖ్య	వార్డు	విద్యార్థుల సంఖ్య
14	162	20	236
15	293	21	214
16	271	22	392
17	202	23	463
18	273	24	502
19	273	25	448
		26	297
		27	294

విద్యార్థులకు సువర్ణ అవకాశం



జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెనల ద్వారా విద్యార్థులు వారి ఉన్నత విద్య కలను సాకారం చేసుకునే సువర్ణ అవకాశం లభిస్తోంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో ఏటా లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్యావంతులు అవుతున్నారు. గతంలో ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఎంతో ఉంది పేద విద్యార్థులు ఆసక్తి ఉన్నా.. ఉన్నత విద్యకు దూరంగా ఉండే వారు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అందరూ నిర్భయంగా, స్వేచ్ఛగా ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు.

– గంగాధర్, విద్యార్థి

పూర్తిస్థాయిలో వినియోగించుకుంటున్నాం



జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుంటున్నాం. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వేల మంది ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఈ పథకాలే మూలం. ప్రభుత్వం విడుదల చేసిన నిధులను మెస్ చార్జీలు, వసతిగృహ చార్జీలకు చెల్లిస్తున్నారు. ఈ పథకాలతో ఉన్నత విద్యార్హతను సాకారం చేసుకుంటున్నాం.

– శ్యామ్, ఏయూ విద్యార్థి

సీఎం జగన్‌తోనే సంక్షేమ పథకాల అమలు



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, తదితరులు

ఎంవీపీ కాలనీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సంక్షేమ పథకాలు అమలు సాధ్యమని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. తూర్పు నియోజకవర్గంలో తలపెట్టిన పాదయాత్ర గురువారం 19వ రోజుకు చేరింది. గురువారం 19వ వార్డులో ఎంపీ పర్యటించారు. మూలపాలెం, వాసవానిపాలెం, అప్పుఘర్ ప్రాంతాల్లో పార్టీ వార్డు ఇన్‌చార్జ్ పుక్కళ్ల ధనలక్ష్మితో కలిసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. ప్రతి ఇంటి అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన నవరత్న పథకాలు దోహదం చేస్తున్నాయన్నారు. విద్యా, సంక్షేమం, అభివృద్ధిలో సీఎం చెరగని ముద్రవేశారన్నారు. రాష్ట్రం ప్రగతి పథంలో నడవాలంటే వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ అధికారులకు అభినందన



జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు క్యాలెండర్ అందిస్తున్న ఈపీడీసీఎల్ అధికారులు

ఎంవీపీ కాలనీ: ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ఎల్.మహేంద్రనాథ్‌తో పాటు పలువురు ఉన్నతాధికారుల సేవలను జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర కొనియాడారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఎస్ఈతో పాటు ఏపీఈపీడీసీఎల్ తూర్పు పంపిణీ డివిజన్‌కు సంబంధించిన పలువురు ఉన్నతాధికారులు ఆమెను గురువారం జెడ్పీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ రూపొందించిన క్యాలెండర్‌ను ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సేవల పురోగతి, పలు ప్రాజెక్టులు వేగవంతంగా నిర్వహించడం పట్ల వారికి అభినందనలు తెలిపారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



చెరకుగడల మధ్యలో చక్కెర పొంగలి వండుతున్న ఉపాధ్యాయులు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలోని పలు పాఠశాలల్లో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పిల్లలు సంప్రదాయ దుస్తుల్లో అలరించారు. సంక్రాంతి ముగ్గులు వేసి చెరకు గడలతో పందిళ్లు వేశారు. భోగి మంట వేశారు. గంగిరెద్దులతో డూడూ బసవన్న అంటూ ఆటలు ఆడించారు. భారతీ స్కూల్‌లో కట్టెల పొయ్యిపై చక్కెర పొంగలి, పిండి వంటలు తయారు చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది.



జోడుగుళ్లపాలెంలో భోగి మంట వద్ద ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, కార్పొరేటర్ స్వాతి

9వ వార్డులో..

జీవీఎంసీ 9వ వార్డులో గురువారం కార్పొరేటర్ స్వాతి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. జోడుగుళ్లపాలెం వద్ద జరిగిన ఈ సంబరాలలో విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ పాల్గొని భోగి మంటను వెలిగించారు. కొద్ది సేపు స్థానికులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో ఆయన సరదాగా గడిపారు. ఈ సందర్భంగా వార్డులో ప్రజలకు ఎంవీవీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఏయూ భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు

- అంగుళం భూమి కూడా అన్యాక్రాంతం కానివ్వం
- త్వరలో రక్షణ గోడల నిర్మాణం
- వర్సిటీ రిజిస్ట్రార్ జేమ్స్‌స్టీఫెన్



నగరంపాలెంలో ఏయూ భూములను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్‌స్టీఫెన్, తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. గురువారం మధ్యాహ్నం ఆయన మధురవాడ సమీప నగరంపాలెంలో ఉన్న ఏయూ భూములను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్సిటీకి చెందిన భూమిని, గతంలో ఇక్కడ భౌతికశాస్త్ర సంబంధ పరిశోధనలకు ఉపయుక్తంగా నిర్మించిన భవనం, తదితర వసతులను పరిశీలించారు. తక్షణం ఈ స్థలం చుట్టూ రక్షణ గోడ నిర్మించాలని యూనివర్సిటీ ఇంజినీర్‌ను ఆయన ఆదేశించారు. ఈ ఖాళీ స్థలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇటువంటి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని రిజిస్ట్రార్ హెచ్చరించారు. ఏయూ స్థలాల చుట్టూ రక్షణ గోడల నిర్మాణం, సెక్యూరిటీ సిబ్బంది నియామకం చేపడతామన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి సంబంధించిన అంగుళం భూమిని కూడా అన్యాక్రాంతం కాకుండా పరిరక్షిస్తామన్నారు. వర్సిటీ ఆస్తులను ఆక్రమించినా, కబ్జా చేయాలని ప్రయత్నించినా ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఇంజనీర్ ఆర్.శంకరరావు, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మహ్మద్‌ఖాన్, ఇంజినీరింగ్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుబజార్ స్టాళ్లకు డ్రా



రైతులకు స్టాళ్ల టోకెన్లు అందజేస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు గురువారం ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు ఆధ్వర్యంలో డ్రా తీసి రైతులకు కేటాయించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహిస్తున్న బజార్‌కు సంబంధించి కార్డుదారులకు స్టాళ్ల టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ 66 మంది రైతుల స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతుబజార్ సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

నిర్మాణం సరే.. ప్రారంభమెప్పుడు?

- కైలాసగిరిపై నిరుపయోగంగా మరుగుదొడ్లు
- వినియోగంలోకి తీసుకురావాలని సందర్శకుల విజ్ఞప్తి



కైలాసగిరిపై నిరుపయోగంగా ఉన్న కొత్త మరుగుదొడ్లు

ఆరిలోవ: నగరంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా పేరుపొందిన కైలాసగిరిపై కొత్తగా నిర్మించిన మరుగుదొడ్లు వినియోగంలోకి రాకుండా మరుగున పడ్డాయి. ఇక్కడకు నగరంతో పాటు విదేశీ పర్యాటకులు సైతం అధిక సంఖ్యలో వస్తుంటారు. సందర్శకుల సౌకర్యార్థం కొన్ని ఏళ్ల క్రితం నిర్మించిన మరుగుదొడ్లు శిథిలమయ్యాయి. దీంతో గతేడాది వీఎంఆర్‌డీఏ అధికారులు సుమారు రూ.10 లక్షల నిధులు ఖర్చు చేసి కొత్తగా మరుగుదొడ్లు నిర్మించారు. రద్దీ సమయంలో సందర్శకులు కూర్చోవడానికి సైతం సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. అంత వరకు బాగానే ఉంది. నిర్మాణం పూర్తయి ఏడాది గడిచిన కొత్త మరుగుదొడ్లు మాత్రం వినియోగంలోకి రాలేదు. దీంతో శిథిలమైన పాత మరుగుదొడ్లే సందర్శకులకు అందుబాటులో ఉన్నాయి. ప్రతి శని, ఆదివారాలతో పాటు కార్తీక మాసం, సంక్రాంతి, పాఠశాలల, కళాశాలలకు దసరా సెలవులు, వేసవి సెలవులు సమయాలలో ఇక్కడ సందర్శకుల రద్దీ ఉంటుంది. అలాంటి సమయాలలో మరుగుదొడ్ల వద్ద సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త మరుగుదొడ్లను ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

జనవాహిని పార్టీ కార్యవర్గం నియామకం



జనవాహిని పార్టీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జాతీయ అధ్యక్షుడు ప్రసాద్‌బాబు, సభ్యులు

ఆరిలోవ: జనవాహిని పార్టీ కార్యకర్తల సమావేశం గురువారం ఆరిలోవలో జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయంలో జరిగింది. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు డి.ఎస్.ఎన్.వి.ప్రసాద్ బాబు పాల్గొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కొత్త కార్యవర్గం నియామకం చేపట్టారు. రాష్ట్ర అధ్యక్షుడిగా మేడిచర్ల మురళి, విశాఖ జిల్లా అధ్యక్షుడిగా చోడవరపు శంకర్, విజయనగరం అధ్యక్షుడిగా రుద్రరాజు దిలీప్‌తో పాటు గాజువాక, కాకినాడ, బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గాల కార్యవర్గాలను నియమించారు. అనంతరం పార్టీ పోస్టరుతో పాటు మానవ హక్కుల పరిరక్షణ సమితి క్యాలెండరును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి ఇన్‌చార్జి పారిపల్లి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఊరెళ్తే.. ఇల్లు జాగ్రత్త!

ఫోర్త్‌టౌన్ క్రైం పోలీసుల ఆటో ప్రచారం



ప్రచార ఆటోను ప్రారంభిస్తున్న ఎస్ఐ అప్పారావు

సీతమ్మధార: సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్లే వారు తగు జాగ్రత్తలు పాటించాలని ఫోర్త్‌టౌన్ క్రైం ఎస్ఐ అప్పారావు కోరారు. ఇంటికి తాళం వేసి.. బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను బ్యాంకు లాకర్‌లో భద్రపరుచుకోవాలని సూచించారు. ఈ మేరకు గురువారం ఫోర్త్‌టౌన్ క్రైం పోలీసులు ఆటో ద్వారా ప్రచారం చేశారు. పండగ వేళ ఎటువంటి నేరాలు జరగకుండా ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఆటో ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. మీ ఇంటికి, అపార్ట్‌మెంట్‌కు సీసీ కెమెరాలను అమర్చాలని, వాటి వల్ల నేరాలను నివారించేడమే కాకుండా, వాటిని ఛేదించేందుకు ఉపయోగపడుతుందన్నారు. మహిళలు బంగారు నగలు ధరించి ఒంటరిగా వెళ్లరాదని, వాకింగ్ చేసే సమయంలో పూర్తిగా నగలు కనిపించకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఆటో, బస్సు ప్రయాణాల్లో విలువైన ఆభరణాలు, నగదు తీసుకెళ్లినప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. మీ వాహనాలకు పోర్క్‌లాక్, జీపీఎస్‌ను అమర్చాలాలని సూచించారు. అనుమానిత వ్యక్తుల సమాచారాన్ని డయల్ 100కు కాల్‌చేసి పోలీసులకు, సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈస్ట్ క్రైం సీఐ సెల్ నంబర్ 83310 41656, ఫోర్త్‌టౌన్ క్రైం ఎస్ఐ నంబర్ 73822 96913, ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ నంబర్ 0891 2710695లకు కాల్ చేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు



నో ఎంట్రీ బోర్డును సూచిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్, సీఐ మళ్ల అప్పారావు

మద్దిపాలెం: రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జ్ఞానాపురం నుంచి ఎన్ఏడీ బ్రిడ్జి వరకు బీఆర్‌టీఎస్ మధ్య రోడ్డులో పలు వాహనాలకు అనుమతి లేదని నో ఎంట్రీ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ జి.రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ మధ్య రోడ్డులో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు ప్రయాణించడం వల్ల అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. మధ్య రోడ్డులో కేవలం బస్సులు, అంబులెన్సులు మాత్రమే ప్రయాణించాలని, దానికోసమే నో ఎంట్రీ బోర్డులను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇతర వాహనాలు రహదారికి ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్డులో ప్రయాణించాలని సూచించారు.

జ్ఞానాపురం నుంచి ఎన్ఏడీ ఫ్లై ఓవర్ వరకు సూచిక బోర్డులను ఏర్పాటు చేశామని, వాటిని గమనించి వాహనాలు నడపాలని వాహనదారులకు సూచించారు. కార్యక్రమంలో కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కంచరపాలెం: కంచరపాలెం అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో ఆంధ్రా బౌద్ధ సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి మహిళలకు టైలరింగ్, యువతకు కంప్యూటర్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ముందుగా దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 96760 30455 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కనకమహాలక్ష్మి అలంకరణలో కన్యకాపరమేశ్వరి



ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి

దాబాగార్డెన్స్ : పాతనగరంలోని కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకా పరమేశ్వరి ఆలయంలో మార్గశిర మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా గురువారం అమ్మవారిని కనకమహాలక్ష్మిగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ మండపంలో ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్ శర్మచే 250 మంది మహిళలతో సామూహిక కుంకుమ పూజలు జరిపారు. కార్యక్రమంలో దేవాలయ సంఘం అధ్యక్షుడు అరిసెట్టి దినకర్, కార్యదర్శి గ్రంథి రామకృష్ణారావు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, కేవీ రమణయ్య, పూసర్ల సంజీవి, పాలూరి వరప్రసాద్, కొల్లూరు రాము, బొడ్డు రఘు, నల్లూరి నూకరాజు, పెనుగొండ కామరాజు, వర్ధనబాబు, కట్టమూరి ప్రసన్న, కుంచం సత్యవతి, సుజాత, శైలజ పాల్గొన్నారు.